క్లుప్తంగా

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం రుక్సాన మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో వైద్యులు ముస్తాక్ అహ్మద్ పాల్గొని విద్యార్థులకు పరీక్షలు జరిపి మందులను అందజేశారు. అలాగే దంతాల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, ఉపన్యాసకులు ఉన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు, ఫర్నిచర్ వితరణ



పుస్తకాలు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో గడ్డం గంగారాం- లింగమ్మ ట్రస్ట్ ద్వారా అంబేడ్కర్ జ్ఞానమందిరానికి పుస్తకాలను, ఫర్నిచర్‌ను శుక్రవారం అందించారు. యువత తీరిక వేళల్లో చదువుకునేందుకు వీలుగా పుస్తకాలను ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ గడ్డం భూమారెడ్డి, ప్రతినిధి గడ్డం దివాకర్‌రెడ్డి, సర్పంచ్ కూన సులోచన, వార్డు సభ్యుడు రాజేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ అంబటి రవి, నాయకులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా



సభ్యులు హాజరు కాక ఖాళీగా ఉన్న కుర్చీలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు ఉండగా, ఇన్‌చార్జి ఎంపీపీ హాజరు కాకపోవడంతో పాటు, కోరం కూడా లేకపోవడంతో మండల సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో రాజేశ్వరి ప్రకటించారు. ఉదయం 11 గంటలకు కొంత మంది సర్పంచులు, ముగ్గురు ఎంపీటీసీలు, ఒక కో–ఆప్షన్ సభ్యుడు మాత్రమే హాజరయ్యారు. మిగతా వారు హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు.

ఇంటి నిర్మాణాన్ని నిలిపివేయాలి

జగిత్యాలరూరల్: మండలంలోని బాలపల్లి గ్రామానికి చెందిన దొందరి గంగారాం తన పాత ఇంటి స్థలంలో తనకు తెలియకుండా ఇంటి నిర్మాణం చేస్తున్నారని, వెంటనే నిర్మాణాన్ని నిలిపివేయాలని శుక్రవారం రూరల్ ఎంపీడీవో రాజేశ్వరికి ఫిర్యాదు చేశారు. గ్రామంలో తన పేరున ఉన్న పాత ఇల్లు శిథిలావస్థలో ఉండటంతో వేరే చోట నివాసం ఉంటున్నానని, దానిని గుంటి మహేశ్ అనే వ్యక్తి కూల్చివేసి పంచాయతీ కార్యదర్శితో కుమ్మక్కై అక్రమంగా గృహ నిర్మాణం అనుమతులు తీసుకుని ఇల్లు నిర్మిస్తున్నాడని, వెంటనే నిర్మాణం ఆపేసి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకెళ్లడం తప్పదని ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో గొడిసెల తిరుపతి అనే వ్యక్తి రెండు సార్లు మద్యం తాగి వాహనం నడిపి పట్టుబడగా శుక్రవారం స్పెషల్ జ్యుడీషియల్ సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గంప కరుణాకర్ నిందితుడికి రెండు రోజుల జైలుశిక్ష విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారికి మొదటి దఫా కౌన్సెలింగ్, రెండోసారి దొరికిన వారికి జైలుశిక్షతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. మద్యం తాగి ఎవ్వరూ కూడా వాహనం నడపొద్దని కోరారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మెట్‌పల్లి: ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుకను మెట్‌పల్లికి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టణంలో పోలీసులు పట్టుకున్నారు. అనంతరం వీటిని తహసీల్దార్‌కు అప్పగించారు. అనుమతి లేకుండా ఇసుక విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై చిరంజీవి తెలిపారు.



బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తున్న మహిళలు, ప్రయాణికులు



బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న మహిళలు

ఉరుకులు.. పరుగులు

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు ఏ బస్సు వచ్చినా ఉరుకులు, పరుగులే. ఒకరికొకరు తోసుకునుడే..కనీసం ఆయా బస్సుల్లో నిలబడి పోదామన్నా ఆ పరిస్థితి లేదు. చివరకు బస్టాండ్‌లో కనీసం గంటసేపు నిలబడితేనే బస్సులు దొరికే పరిస్థితి. శుక్రవారం శుభకార్యాలు ఉండటంతో ఆర్టీసీ బస్టాండ్ అంతా మహిళలతో నిండిపోయి ఉంది.

నాలుగో రోజుకు తపాలా ఉద్యోగుల సమ్మె

జగిత్యాలటౌన్: సమస్యల పరిష్కారం కోసం తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాల్గో రోజుకు చేరింది. జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన తపాలా ఉద్యోగులు జగిత్యాల హెడ్ పోస్టాఫీస్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, 7వ వేతన సవరణ సంఘం ఇచ్చిన నివేదికలోని అన్ని డిమాండ్లు పరిష్కరించాలన్నారు. మూడునాలుగు గంటల పని పేరుతో రోజుకు 14గంటలు పనిచేయిస్తున్నారని ఆరోపించారు. గ్రామీణ తపాలా ఉద్యోగులపై ఆ శాఖ అధికారులు పనిభారం పెంచుతూ వేధింపులకు పాల్పడటం మానుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు నిరసనలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ జీడీఎస్ ఉద్యోగుల సంఘం సెక్రెటరీ కాలగిరి శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షులు ఎస్. రమాపతిరావు, జహీరుద్దీన్, ఆనందరావు, ప్రమోద్, మాణిక్యం, ఇంతియాజ్, రామకృష్ణ, ఆర్.నర్సయ్య, గంగరాజం, శంకరయ్య పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిలబడి తపాలా ఉద్యోగుల నిరసన

మెట్‌పల్లి: సమ్మెలో భాగంగా తపాలా ఉద్యోగులు పట్టణంలో శుక్రవారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు హెడ్ పోస్టాఫీస్ ఆవరణలో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫారూఖ్, అనూహ్య, శరణ్య, విజయ్, అశోక్, శ్రీధర్, దేవేందర్ తదితరులున్నారు.



నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

ఓడినా గెలిచినా.. మీవాడినే..

ధర్మపురి: 'నేను ప్రజల మనిషిని. ఓడినా గెలిచినా ప్రజల కోసం పని చేస్తా. నేను ఈ స్థాయికి నిప్పుల్లో నడిచి వచ్చా. గెలిచినపుడు ఎగరలేదు. ఓడినపుడు బాధపడను. నా ఓటమి నన్ను బాధపెట్టలేదు. కార్యకర్తలు, ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటా' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురిలోని శ్రీలక్ష్మీనృసింహ ఫంక్షన్ హాలులో శుక్రవారం నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఓటమిని చవిచూసిన కొప్పుల ఈశ్వర్‌కు మహిళలు గుండెల నిండా దు:ఖంతో, కన్నీటితో స్వాగతం పలుకగా ఆయన వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం కోసం అహర్నిశలు కృషి చేశారని, వారి కృషి మరులేనని పేర్కొన్నారు. ఓడి పోయామనే భావన మనలో ఉండకూడదని, రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామని, అందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు. గడిచిన ఎన్నికల్లో జరిగిన లోటు పాట్లను సమీక్షించుకొని ముందుకు సాగుదామని సూచించారు. సమావేశంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ, జెడ్పీటీసీలు చిట్టిబాబు, బాదినేని రాజమణి, బత్తిని అరుణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



కథలాపూర్: భూషణ్‌రావుపేటలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు

పెగడపల్లి: ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వ విప్‌గా నియామకం కావడంతో మండల కేంద్రంలో శుక్రవారం మండల కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరిపారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద నాయకులు టపాసులు పేల్చి సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు రవినాయక్, తిరుపతి, శ్రీనివాస్,, భాస్కర్, విష్ణు, సతీశ్‌రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు విప్ పదవిపై కథలాపూర్‌లో...

కథలాపూర్: వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రభుత్వ విప్ పదవి రావడంపై పీసీసీ కార్యవర్గసభ్యుడు తొట్ల అంజయ్య ఆధ్వర్యంలో శుక్రవారం కథలాపూర్‌లో సంబరాలు జరిపారు. ఆయా గ్రామాల్లో నాయకులు సంబరాలు జరిపి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఇందుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపిడి ధనుంజయ్‌రెడ్డి, కల్లెడ గంగాధర్, ఎం.డీ హఫీజ్, కట్ట శంకర్, గడ్డం చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి, బీమారంలో..

మేడిపల్లి: వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ప్రభుత్వ విప్‌గా నియమించడంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మేడిపల్లి,బీమారం మండలాల్లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, నాగరాజు, సాయిగౌడ్, మధు, రాజశేఖర్, దామోదర్, మహేశ్‌రెడ్డి, సయ్యద్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రూపాయి పొదుపుగా వాడితేనే ఆర్థికాభివృద్ధి

సారంగాపూర్: ప్రతీ రూపాయిని పొదుపుగా వినియోగిస్తేనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని కేడీసీసీ బ్యాంక్ తుంగూర్ మేనేజర్ హరిప్రసాద్, కేడీసీసీ బ్యాంక్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు అన్నారు. బీర్‌పూర్ మండలం చెర్లపల్లిలో శుక్రవారం ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఏడాది కనీసం కొంత వరకైనా ప్రతి కుటుంబం కొద్ది మొత్తంలోనైనా కేడీసీసీ బ్యాంక్‌లో డిపాజిటః చేసుకుంటే మిగిలిన బ్యాంక్‌ల కంటే అధిక వడ్డీ వస్తుందన్నారు. బ్యాంక్‌లో డిపాజిట్లు, రుణాలు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో బీర్‌పూర్ సొసైటీ సీఈవో అయ్యోరి తిరుపతి, సర్పంచ్ అజ్మీరా ప్రభాకర్, ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్, లవన్‌కుమార్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేనేజర్, ఉమ్మడి జిల్లా డైరెక్టర్

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి

జగిత్యాల: అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. శుక్రవారం కొత్తవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరునెలలు దాటిన పిల్లలకు తల్లిపాలతో పాటు, అనుబంధ పోషకాహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా అయ్యే కోడిగుడ్లు, పాలు, బాలామృతం గర్భిణులు, పిల్లలు తప్పకుండా తీసుకోవాలన్నారు. మూడేళ్లు దాటిన పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య అందించడం జరుగుతుందన్నారు. పిల్లల్లో మానసిక వికాసం పెంపొందించడంతో పాటు, సృజనాత్మకత, ఇతర నైపుణ్యాలు అలవాటుపడతాయన్నారు. కార్యక్రమంలో స్వరూపరాణి, రజిత, మాధవి, ఏ.మాధవి పాల్గొన్నారు.



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు

చెత్తబండ్లను అడ్డుకున్న ఒడ్డెర కాలనీవాసులు

రాయికల్: ఒడ్డెరకాలనీ శివారులో డంప్‌చేయవద్దని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఒడ్డెరకాలనీ వాసులు చెత్తబండ్లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్‌యార్డులో చెత్తను కాల్చడం వల్ల ఉదయం, రాత్రివేళల్లో వాతావరణ కాలుష్యం ఏర్పడటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న కమిషనర్ సంతోష్‌కుమార్ కాలనీవాసులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

తహసీల్దార్‌కు వినతి

రాయికల్: పట్టణంలోని 10వ వార్డులో ఉన్న రైస్‌మిల్లుల్లో కాలుష్యం ఎక్కువగా వస్తుందని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు శుక్రవారం తహసీల్దార్ ఖయ్యాంకు వినతిపత్రం సమర్పించారు. రైస్‌మిల్లు నుంచి వచ్చే దుమ్ము ద్వారా ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నిగా గంగరాజం, భూమయ్య, రాజు, జీవన్, రాకేశ్, అభిషేక్ పాల్గొన్నారు.

మన ఊరు- మన బడి పనులు పరిశీలన

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్లలో మన ఊరు– మన బడి పనులను డీఈ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. అదనపు తరగతి గది స్లాబ్ పనులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. త్వరగా పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట ఏఈ కార్తీక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అర్షద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు మల్లాపూర్ మండల సర్వసభ్య సమావేశం

మల్లాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ కాటిపెల్లి సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజశ్రీనివాస్ తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ పాల్గొననున్నారని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు చర్చించనున్నట్లు తెలిపారు.

కనుల పండువగా పడిపూజ

రాయికల్: పట్టణంలో గురుస్వామి ఇల్లెందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు సత్యంశర్మ, సాయిసుదీర్ శర్మ ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించగా, అయ్యప్ప దీక్షాపరులు చేసిన భజనలతో అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. ఈ పడిపూజలో రాయికల్, మల్లాపూర్ మండలాలకు చెందిన స్వాములు పాల్గొన్నారు.కార్యక్రమంలో గురుస్వాములు పాల్గొన్నారు.



పడిపూజలో పాల్గొన్న గురుస్వాములు

సర్దార్ పటేల్‌కు నివాళి



జగిత్యాలలో నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: సర్దార్ వల్లభాయి పటేల్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని పటేల్ చౌక్‌లోని సర్దార్ పటేల్ విగ్రహానికి భారత్ సురక్షా సమితి ప్రతినిధులు, బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీనాథం,శ్రీకాంత్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని రామాజీపేటలో ఉక్కుమనిషి సర్దార్ వల్లబాయ్‌పటేల్ వర్ధంతిని శుక్రవారం మున్నూరుకాపు యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల మహేశ్, సంఘ అధ్యక్షుడు కోల రాజు, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండలో నవతరం యూత్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో కాసోజి ప్రశాంత్, గాంధారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం కలిగిన అమ్మాయిలు దేన్నైనా సాధిస్తారు

జగిత్యాల: ఆత్మ విశ్వాసం కలిగిన అమ్మాయిలు దేన్నైనా సాధించగలుగుతారని, స్వతంత్రంగా ఆలోచించాలని, ఎవరిపై ఆధారపడకుండా జీవితం గడపాలని మహిళా డిగ్రీ కళాశాల సత్యనారాయణ అన్నారు. కీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ సీఈవో జ్యోతిరెడ్డి శుక్రవారం విద్యార్థినులతో సమావేశంనిర్వహించారు. ఈ జ్యోతిరెడ్డి మాట్లాడుతూ మహిళలు ఎన్ని కష్టాలైనా ఎదుర్కొని ముందుకు వెళ్లాలని, అలాంటప్పుడే సాధికారత సాధిస్తామన్నారు. నేను ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ ఈరోజు ఈస్థాయికి చేరుకున్నాన్నారు. విద్యార్థులు ప్రతీది ఒక చాలెంజ్‌గా తీసుకోవాలన్నారు. నేను ఓడిపోలేదు.. ఏ అమ్మాయి ఓడిపోదు అనే మాట ప్రపంచవ్యాప్తంగా అనేక మందికి ప్రేరణగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు పిడియాట్రిక్ ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అభివాదం చేస్తున్న జ్యోతిరెడ్డి

నిరుపేద కుటుంబాలకు ఆర్థికసాయం

బుగ్గారం: మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన ఎన్నారై శనిగారపు తిరుపతి తన భార్య పుట్టిన రోజు ఓ నిరుపేద కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఉద్యోగ రిత్యా ఆస్ట్రేలియాలో స్థిరపడిన తిరుపతి ఇప్పటికే గ్రామంలో వివిధ సందర్భాలలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తన భార్య రిషిక పుట్టినరోజు సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందికి నిత్యావసర సరుకులు అందించారు. అలాగే గ్రామంలో కుటుంబపెద్దను కోల్పోయిన ఓ నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం చేసి, వారి పిల్లలకు నోటుబుక్కులు, ఇతర విద్యాసామగ్రి అందించారు. కార్యక్రమంలో స్థానిక మిత్రులు పాల్గొన్నారు.



సరుకులు అందిస్తున్న తిరుపతి మిత్రులు

సంక్షిప్త వార్తలు

బోధన అంశాలు సాధన చేయించాలి

జగిత్యాల: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉన్నతి లక్ష్య అకాడమిక్ కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు ప్రతినెలా అకాడమిక్ మానిటరింగ్ సమావేశం నిర్వహించాలని ఎస్‌సీఈఆర్టీ మానిటింగ్ అధికారులు మనోహరచారి, శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఓల్డ్‌హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఉపాధ్యాయుడు తాను బోధించే ప్రతి తరగతి బోధన అంశాలను తర్వాతి పీరియడ్‌లో సాధన చేయించాలన్నారు. తద్వారా అభ్యసన ఫలితాలు సాధించేలా కృషి చేయవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో బేస్‌లైన్ టెస్ట్ ఫలితాలు, ఎస్ఏ–1 పరీక్ష పేపర్లు, రిజిష్టర్లు తనిఖీ చేశారు. కా ర్యక్రమంలో బృందం సభ్యులు మనోహరచారి, ఈ ర్షాద్‌అలీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాశ్, బాలకిషన్, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని శివగాయత్రి అనాథ వృద్ధాశ్రమానికి జగిత్యాల విద్యానగర్‌కు చెందిన క్యాస సంతోష్ రెడ్డి-ప్రణీత దంపతుల కుమారుడు కార్తీకేయ రెడ్డి జన్మదినం సందర్భంగా రూ 6 వేల విరాళం శుక్రవారం ఆశ్రమ నిర్వాహకుడు సూరజ్ శివశంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

లలితమాత ఆలయంలో పారాయణం

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస 108 శ్రీచక్ర సహిత లలితమాత ఆలయంలో శుక్రవారం మహిళలు లలిత సహస్ర స్తోత్ర పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం 108 శ్రీచక్రాలకు సుహాసినిలు కుంకుమపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెల్లెం స్వరూప పాల్గొన్నారు.

సరస్వతీ శిశుమందిర్‌లో ప్రొఫెషనల్ డే

కోరుట్ల: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో శుక్రవారం ప్రొఫెషనల్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైమరీ పాఠశాల విద్యార్థులు వివిధ కులవృత్తులు, ప్రొఫెషనల్ వేషధారణలో ఆకట్టుకున్నారు. కుల వృత్తుల గొప్పతనం గూర్చి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నీలి శ్రీనివాస్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'నియోజకవర్గంలో అక్రమాలపై విచారణ జరిపిస్తాం'

మెట్‌పల్లి: కోరుట్ల నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపిస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు పూదరి రాము పేర్కొన్నారు. పట్టణంలో పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. ప్రతి విభాగంలో అక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. భూములకు సంబంధించి అన్యాయానికి గురైన బాధితులు తమను సంప్రదిస్తే వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. నాయకులు అందె మారుతి, ముఖీమ్, రాంప్రసాద్, శేఖర్, శివ, శ్రీధర్ తదితరులున్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయాలి

మల్లాపూర్: గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న పనులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, లేనిఎడల చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమాల్లో ఎంపీవో జగదీశ్, ఈజీఎస్ ఏపీవో సతీష్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని భవానినగర్, ఎమ్మెల్యే క్వార్టర్స్, కలెక్టర్‌రెసిడెన్సీ, కరీంనగర్‌రోడ్, క్యాంప్ రామాలయం ఏరియా, ధరూర్ క్యాంప్, చర్చి ఏరియా, అయ్యప్ప కాలనీ, బుడిగజంగాల కాలనీ, పద్మనాయక వెనుక, హైటెక్ కాలనీ, శాంతినగర్, అంతర్గాంరోడ్, గణేశ్‌నగర్‌లో శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ -3 ఏఈ రహీం తెలిపారు.



ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీష్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మల్యాల: మండలంలోని తాటిపల్లి, రాంపూర్, పోతారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.